ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
మంగళవారం
28 అక్టోబర్ 2025

రైతులు ఆందోళన చెందవద్దు:మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపాను నేపథ్యంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇంతకంటే పెద్ద ఉపద్రవాలను పక్కా ముందస్తు ప్రణాళికతో, పకడ్బందీ ఏర్పాట్లతో విజయవంతంగా అధిగమించగలిగామన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను, కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. తుపాను కారణంగా రైతులు నష్టపోతే.. పూర్తిగా ఆదుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

ఏపీలో 233 మండలాలు, 44 మున్సిపాలిటీలపై 'మొంథా' ఎఫెక్ట్!

అమరావతి, అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

రాయలసీమ జిల్లాల్లోనూ పలుచోట్ల చిరుజల్లులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 233 మండలాలు, 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీలపై తుపాను ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 2,194 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 3,465 మంది గర్భిణీలు, బాలింతల సంరక్షణకు అధికారులు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపింది. 19 జిల్లాల పరిధిలోని 54 రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాల్లో కమ్యూనికేషన్ కోసం 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు ఏర్పాటు చేశామని తెలిపింది. 11 ఎన్డీఆర్ఎఫ్ 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు పేర్కొంది.

విజయవాడలో వర్షం... అప్రమత్తమైన యంత్రాంగం

విజయవాడ, అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపాను ప్రభావంతో విజయవాడలోని పలు ప్రాంతాల్లో వర్షం పడుతోంది. నేడు నగరంలో 16.2 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాల విక్రయ దుకాణాలు తెరుచుకోవచ్చని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 41 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొండపై నివసిస్తున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్లో 9154970454, వీఎంసీ కార్యాలయంలో 08662424172, 08662422515, 08662427485 నంబర్లను ఏర్పాటు చేశారు.

మొంథా ఎఫెక్ట్:107 రైళ్ల రద్దు.. హెల్ప్ డెస్క్ నెంబర్లివే..

అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏపీలోని కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. మంగళ, బుధవారాల్లో నడిచే 107 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మంగళవారం 70, బుధవారం 36, గురువారం ఒక రైలును రద్దు చేసినట్లు వెల్లడించింది.

హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్టణం, గుంటూరు, కాకినాడ, తెనాలి, రేపల్లె, మార్కాపురం, మచిలీపట్నం, నర్సాపురం, నిడదవోలు, ఒంగోలు, భీమవరం, మాచర్ల నుంచి బయల్దేరే పలు రైళ్లు రద్దయ్యాయి. ఆరు రైళ్లను దారి మళ్లించినట్లు.. 18 రైళ్ల సమయాల్లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలను రైల్వేశాఖ అధికారిక వెబ్సైట్లో పొందుపరిచింది. రైళ్ల రద్దు సమాచారాన్ని ప్రయాణికులకు పంపింది. ఆయా ప్రయాణికులకు టికెట్ మొత్తం తిరిగి చెల్లించనుంది. మరోవైపు విజయవాడ డివిజన్లోని ప్రధాన రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్ లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది.

హెల్ప్ డెస్క్ నెంబర్లు

విజయవాడ - 0866-2575167
నెల్లూరు - 9063347961
ఒంగోలు 7815909489
బాపట్ల - 7815909329
తెనాలి - 7815909463
ఏలూరు - 7569305268
రాజమహేంద్రవరం- 8331987657
సామర్లకోట - 7382383188
తుని - 7815909479
అనకాపల్లి - 7569305669
భీమవరం - 7815909402
గుడివాడ - 7815909462

మాజీ మంత్రి హరీశ్రావుకు పితృవియోగం

హైదరాబాద్, అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్లోని క్రిస్ట్ల్లాస్లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ఫిల్మ్నగర్లోని మహాప్రస్థానంలో మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సత్యనారాయణ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

సీఎం రేవంత్ సంతాపం

తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల సీఎం రేవంత్రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. హరీశ్రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బావతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న కేసీఆర్

హరీశ్రావు తండ్రి, తన బావ (7వ సోదరి, అక్క లక్ష్మీ భర్త) తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. సత్యనారాయణతో తనకున్న అనుంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్రావుకు కేసీఆర్ ఫోన్ చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మొంథా తుపాను.. కూటమి నేతలంతా ప్రజలకు అండగా ఉండాలి:చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): మొంథా తుపాను నేపథ్యంలో సీఎం చంద్రబాబు కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను దృష్ట్యా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలంతా అందుబాటులో ఉండాలన్నారు. కూటమి కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అవసరమైతే కేంద్ర సాయం కూడా కోరతామన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. "ఇవాళ రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉంది. రియల్ టైమ్లోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నాం. పంట నష్ట నివారణ చర్యలను అధికారులకు తెలియజేశాం. ఆకస్మిక వరదల దృష్ట్యా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించాం" అని సీఎం తెలిపారు.



రిపబ్లిక్ సినిమా CINEMA

ఆడియన్స్ అలా చేస్తే బాధ అనిపిస్తుంది:రష్మిక

ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్ ఎంగేజ్మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్. భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని విజయ్, రష్మిక ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా రష్మిక దీనిపై స్పందిస్తూ.. అప్పుడు ఆదరణ దక్కలేదని.. కానీ, ఇప్పుడు యూట్యూబ్లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారని అన్నారు. "డియర్ కామ్రేడ్ను థియేటర్లో ఆడియన్స్తో పాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్లడానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్టు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు. ఒక సినిమా కోసం దర్శకనిర్మాతలు ఎంతో కష్టపడతారు. దానికి తగిన ఫలితం రాకపోతే నిజంగా బాధగా ఉంటుంది. ఆ సమయంలో ఆదరించకుండా రెండు, మూడేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే బాధగా ఉంటుంది" అని తెలిపారు.

ఎప్పుడు చెప్పాలో అప్పుడు చెబుతా: రష్మిక

తాజాగా ఓ ప్రెస్మీట్లో రష్మికను ఓ అభిమాని విజయ్ నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'ఎప్పుడు చెప్పాలో అప్పుడు చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యం నిలకడగా ఉంది :సూర్యకుమార్ యాదవ్

సిడ్నీ వన్డేలో క్యాచ్ పట్టే క్రమంలో శ్రేయస్ అయ్యర్ తీవ్ర గాయానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడి ఆరోగ్యం గురించి టీమ్ ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అప్డేట్ ఇచ్చాడు. ఆసీస్ రేపు (బుధవారం) టీమ్ ఇండియా టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో మ్యాచ్కు ముందు నిర్వహించే ప్రెస్ మీట్లో అతడు శ్రేయస్ అయ్యర్ తాజా పరిస్థితి గురించి మాట్లాడాడు. 'శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడని తెలిసినప్పుడు నేను ఫోన్ చేశాను. అతడి దగ్గర ఫోన్ లేదని తర్వాత నాకు తెలిసింది. దీంతో నేను ఫిజియోకు కాల్ చేశాను. శ్రేయస్ అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని అతడు వివరించాడు. మొదటి రోజే కండీషన్ ఎలా ఉందో కచ్చితంగా చెప్పలేరు. కానీ రెండు రోజులుగా నేను శ్రేయస్ తో మాట్లాడుతున్నా. అతడు ఫోన్లో నాకు సమాధానం ఇస్తున్నాడు. శ్రేయస్ రిప్లై ఇస్తున్నాడంటే, అతడి ఆరోగ్యం స్థిరంగా ఉందని అర్థం. ప్రస్తుతం అతడు బాగానే ఉన్నాడు. వైద్యులు నిత్యం అతన్ని పర్యవేక్షిస్తున్నారు. అతడు మరికొన్ని రోజులు వారి పర్యవేక్షణలో ఉంటాడు. శ్రేయస్ స్పందిస్తున్నాడు కాబట్టి.. ఇది మంచి పరిణామం' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఆసీస్ టూర్ లో భాగంగా టీమ్ ఇండియా అయిదు టీ20ల సిరీస్ను ఆడనుంది. రేపు కాన్బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్ను టీమ్ ఇండియా ఇప్పటికే 2-1 తేడాతో కోల్పోయిన విషయం తెలిసిందే.

ఇంటి చిట్కాలు

ఇప్పుడు చెప్పే వాటిలో ఏ ఒక్కటి వాడినా చాలు కరివేపాకు మొక్క ఏపుగా, గుబురుగా పెరుగుతుంది, ఆకులతో పచ్చగా కళకళలాడుతుంది

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చాలా మంది తమ ఇళ్లల్లో లేదా పెరట్లో కరివేపాకు మొక్కను పెంచుకుంటారు. అయితే, కొన్ని సార్లు మొక్క సరిగ్గా పెరగదు. అలాంటి మొక్కకు కొన్ని సహజ ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది.

కరివేపాకు.. వంటల్లో ఎక్కువగా వాడతారు. కరివేపాకు రుచిని అందించడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇక, చాలా మంది ఇంట్లో కరివేపాకు మొక్కను పెంచుకుంటారు. కూరల్లోకి అవసరమైనప్పుడల్లా పెరట్లోకి వెళ్లి కరివేపాకు తెంచి.. వాడుతుంటారు. కరివేపాకు మొక్కలను పెరట్లో, కుండీల్లో సులభంగా పెంచుకోవచ్చు. వీటికి తగినంత సూర్యరశ్మి, క్రమం తప్పకుండా నీరు అవసరం. నీరు నిలవకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు కత్తిరించడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది. అయితే, కొన్ని కారణాల వల్ల కరివేపాకు మొక్కలు సరిగ్గా పెరగవు. లేదంటే ఆకులు చిన్నవిగా, పసుపు రంగులోకి మారతాయి. మీ ఇంట్లో పెంచుకునే మొక్కకు కూడా ఇలాంటి సమస్యలు ఉంటే నో టెన్షన్. ఇప్పుడు చెప్పే కొన్ని సహజ ఎరువులతో కరివేపాకు దట్టంగా, పచ్చగా మారుతుంది. ఆ ఎరువుల్ని ఇంట్లోనే చేసుకోవచ్చు. పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

కరివేపాకు మొక్కకు ఎరువులు ఎందుకు అవసరం?

ఇంట్లో ఒక్కసారి కరివేపాకు మొక్క నాటితే.. అది ఏళ్ల పాటు ఆకులు ఇస్తుంది. కానీ దానికి సరైన పోషకాలు అందకపోతే మొక్క బలహీనంగా మారుతుంది. దీంతో మొక్క ఎండిపోవడం జరుగుతుంది. అందుకే కరివేపాకు మొక్కకు మంచి ఎరువులు ఇవ్వాలి. సహజ ఎరువులు మొక్క వేర్లను బలపేతం చేస్తాయి. ఆకుల్ని పచ్చగా ఉంచుతాయి. అంతేకాకుండా కొత్త కొమ్మల పెరుగుదలకు సాయపడతాయి. రసాయన ఎరువులకు బదులుగా సహజ ఎరువులు వాడటం వల్ల మొక్క చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇంట్లోనే చేసుకోగల సహజ ఎరువులేంటో ఇప్పుడు చుద్దాం.

అరటి తొక్క కంపోస్ట్

అరటి తొక్కల్లో మొక్కల పెరుగుదలకు అవసరమైన పొటాషియం, భాస్వరం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. అందుకే అరటి తొక్కలతో కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం 2-3 అరటి తొక్కలను చిన్న ముక్కలుగా కోయండి. వాటిని నీటితో నిండిన పాత్రలో 2-3 రోజులు నానబెట్టండి. ఈ నీటిని వడకట్టి మొక్క వేర్లలో పోయాలి. కావాలనుకుంటే మీరు అరటి తొక్కల్ని ఎండబెట్టి గ్రైండ్ చేసి మట్టిలో కలపవచ్చు.

గుడ్డు పెంకు

గుడ్డు పెంకుల్లో కాల్షియం కార్బోనేట్ ఉంటుంది. ఇది మొక్కను బలంగా చేస్తుంది. అందుకే కరివేపాకు మొక్కకు గుడ్డు పెంకులు మంచి ఆప్షన్. ఇందుకోసం 4-5 గుడ్ల పెంకుల్ని తీసుకోండి. వాటిని ఎండలో బాగా ఎండబెట్టండి. ఆ తర్వాత మెత్తటి పొడిలా దంచుకోండి. ఈ పొడిని మొక్క మట్టిలో కలపండి. ఇది మొక్కను వేరు తెగులు నుంచి కాపాడుతుంది. ఆకుల్ని పచ్చగా ఉంచుతుంది.

ఎప్సమ్ సాల్ట్ సొల్యూషన్

ఎప్సమ్ సాల్ట్ మొక్కను పచ్చగా మార్చడానికి సాయపడుతుంది. ఇందుకోసం ఒక లీటర్ నీటిని తీసుకోండి. ఆ తర్వాత ఒక టేబుల్ స్పూన్ ఎప్సమ్ సాల్ట్ ఆ నీటిలో కరిగించండి. ఈ ద్రావణాన్ని ఒక స్ప్రే బాటిల్లోకి తీసుకోండి. దీనిని మొక్కపై పిచికారీ చేయండి. నెలకు ఒకసారి మాత్రమే ఈ సొల్యూషన్ వాడండి. ఇది మొక్క ఆకుల్ని మెరిసేలా, దట్టంగా ఉండేలా చేస్తుంది.

బెల్లం, మజ్జిగ ఎరువు

ఈ రెండు కూడా మొక్క పెరుగుదలకు సాయపడతాయి. బెల్లం, మజ్జిగలో ఉండే బ్యాక్టీరియా నేలను సారవంతం చేస్తుంది. ఇందుకోసం ఒక లీటర్ నీటిని తీసుకోండి. ఆ నీటిలో ఒక టీ స్పూన్ బెల్లం, ఒక కప్పు మజ్జిగ కలపండి. ఈ మిశ్రమాన్ని నాలుగు నుంచి ఐదు రోజుల పాటు పులియబెట్టండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని నీటిలో కలుపుకోండి. ఈ మిశ్రమాన్ని మొక్కపై పిచికారీ చేయండి. లేదంటే మొక్క వేర్లలో ఈ నీటి మిశ్రమాన్ని పోయండి. దీంతో.. మొక్క నేల సారవంతంగా మారి.. బాగా పెరుగుతుంది.

వేప కేక్

వేప పిండిలో ఎన్నో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇది మొక్కను కీటకాల నుంచి రక్షిస్తుంది. అంతేకాకుండా తగిన పోషణను అందిస్తుంది. ఇందుకోసం వేప పిండిని నీటిలో నానబెట్టండి. ఈ మిశ్రమాన్ని రెండు రోజులు అలాగే ఉంచండి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండండి. ఈ నీటిలో ఫిల్టర్ చేసి మొక్కకు పోయాలి. ఇది మొక్కను శిలీంధ్రాలు, కీటకాల నుంచి రక్షిస్తుంది. దీంతో మొక్క ఏపుగా పెరుగుతుంది.

గమనిక
ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించడం జరిగింది.